# మోసగాళ్లకే మోసగాళ్లు

- 1:3 నిష్పత్తిలో అసలు నోట్లకు నకిలీ కరెన్సీ ఇస్తామంటూ బురిడీ
- ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : అసలు కరెన్సీకి 1:3 నిష్పత్తిలో నకిలీ కరెన్సీ ఇస్తామంటూ సినీ ఫక్కీలో మోసగాళ్ళనే మోసం చేస్తున్న ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.60 లక్షల డూప్లికేట్ కరెన్సీ (మనోరంజన్ బ్యాంక్ కరెన్సీ)తో పాటు మూడు 500 నోట్ల రూపాయలు, తప్పుడు నంబర్ ప్లేట్‌తో కూడిన ఎర్టిగా కారు, 6 సెల్‌ఫోన్‌లు, ఒక పోలీసు లాఠీ, పిస్తల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ సుధీర్‌బాబు, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, ఎల్బీనగర్ ఎస్ఓటీ ఏసీపీ మట్టయ్య, ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌లతో కలిసి కేసు పూర్వాపరాలను వెల్లడించారు. అదిలాబాద్ జిల్లాకు చెందిన మహ్మద్ బహుద్దీన్ అలియాస్ జావీద్(53) అటవీశాఖలో సీనియర్ అసిస్టెంట్. అయితే ఉట్నూరు రేంజ్ ఆఫీసులో విధులు నిర్వహిస్తున్న సమయంలో (2014లో) ఒక కేసులో సస్పెన్షన్‌కు గురయ్యాడు. అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులకు గురైన బహుద్దీన్ ఎలాగైన సులభంగా డబ్బులు సంపాదించుకొనే క్రమంలో రియల్‌ఎస్టేట్ బ్రోకర్‌గా మారాడు. ఈ క్రమంలో అతడికి పలు రకాల మోసాలకు పాల్పడడంలో నిష్ణాతుడైన సల్మాన్‌తో పరిచయం ఏర్పడింది. డూప్లికేట్ నోట్లతో ఎలా మోసగించవచ్చో బహుద్దీన్‌కు శిక్షణ ఇవ్వడంతో పాటు అతడి ద్వారా



నిజామాబాద్‌కు చెందిన అండ్రెసన్(37)ను పరిచయం చేసుకున్నాడు. కాగా అండ్రెసన్, నిర్మల్ జిల్లాకు చెందిన మగ్గిడి కిషన్(27) ఆర్‌జీఐఏ విమానాశ్రయంలో ఒకేచోట ట్యాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా డూప్లికేట్ నోట్లతో జనాలను మోసం చేయడంలో శిక్షణ పొందిన బహుద్దీన్ ఈ విషయాన్ని అండ్రెసన్‌కు తెలిపి సులభంగా డబ్బులు సంపాదించవచ్చని అతడిని ప్రేరేపించించాడు. దీనికి అంగీకరించిన అండ్రెసన్ తన తోటి డ్రైవర్ కిషన్‌ను కూడా ఒప్పించాడు. ఈ క్రమంలో ముగ్గురు కలిసి నకిలీ నోట్లు చలామణి చేసే మోసగాళ్ళను గుర్తించారు. తమ వద్ద పెద్ద ఎత్తున నకిలీ నోట్లు ఉన్నాయని, 1:3 నిష్పత్తిలో ఒరిజినల్ నోట్లకు నకిలీ నోట్లను అందచేస్తామని నమ్మిస్తారు. ఈ ఒప్పందం మేరకు బహుద్దీన్, అండ్రెసన్‌లు తమ వద్ద ఉన్న మనోరంజన్ డూప్లికేట్ నోట్లను నకిలీ నోట్లుగా నమ్మించి, అవతలి గ్యాంగ్‌కు ఇస్తారు. ఆ కరెన్సీని అవతలి గ్యాంగ్ చెక్ చేసుకునే లోపు వెనకాల నుంచి కిషన్ అనే వ్యక్తి పోలీసు డ్రెస్‌లో విజిల్ వేస్తూ వస్తాడు. దీంతో నకిలీ నోట్లు కొనేందుకు వచ్చిన అవతలి గ్యాంగ్ పోలీసులు వచ్చారనే భయంతో అక్కడి నుంచి పారిపోతారు. అనంతరం ఈ ముగ్గురు నిందితులు కలిసి యథేచ్ఛగా ఒరిజినల్ కరెన్సీని తీసుకుని వెళ్తారు. ఈ క్రమంలోనే ఈనెల 21న ముగ్గురు నిందితులు నగరంలోని బేగంబజార్‌లో మనోరంజన్ బ్యాంక్ కరెన్సీని కొనుగోలు చేశారు. అనంతరం ఓ వ్యక్తికి ఒరిజినల్ కరెన్సీ ఇస్తే 1:3 నిష్పత్తిలో నకిలీ కరెన్సీ ఇస్తామని నమ్మించారు. ఎల్బీనగర్‌లోని సితారా గ్రాండ్ హోటల్ వద్ద కరెన్సీ మార్చుకునేందుకు యత్నిస్తుండగా అక్కడే తనిఖీలు నిర్వహిస్తున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, స్థానిక పోలీసులతో కలిసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 60 లక్షల మనోరంజన్ బ్యాంక్ కరెన్సీ(డ్యూప్లికేట్ కరెన్సీ)తో పాటు మూడు ఒరిజినల్ 500నోట్లు, సెల్‌ఫోన్‌లు, ఎర్టిగా కారును స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా బహుద్దీన్ మహారాష్ట్ర, నిజామాబాద్, నిర్మల్, రాచకొండ పరిధిలో ఈ తరహా మోసాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.

## గెలుపు ఓటములను సమంగా స్వీకరించాలి

**హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

సిటీబ్యూరో, కంటోన్మెంట్, డిసెంబర్ 22 : గెలుపు ఓటములను సమంగా స్వీకరించి లక్ష్య సాధనలో ముందుకు వెళ్లాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో జిల్లా స్థాయి యువజనోత్సవ కార్యక్రమాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, యువజన, క్రీడా అధికారి ఎన్.సుధాకర్ రావు జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ స్పష్టమైన అవగాహనతో, మంచి సమర్థతతో యువత తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. మంచి ప్రణాళికలు రూపొందించి యువత అన్ని రంగాల్లో రాణించేందుకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత శ్రీ భగవాన్ దాస్, వెంకటేశ్ గౌడ్, యువజన క్రీడా కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యం వికటిస్తే.. వైద్యుడిపై సేవాలోపం కింద శిక్షార్హులు

**ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కాళి ప్రసాద్‌రావు**

సుల్తాన్ బజార్, డిసెంబర్ 22 : ప్రభుత్వ ప్రజా ఆరోగ్య విధి విధానాలను అమలు పర్చడంలో ఐఎంఏ పూర్తి సహాయ సహకారాలను అందిస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పి.కాళిప్రసాద్ రావు అన్నారు. శుక్రవారం ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ విజయ్‌రావు, కోశాధికారి డాక్టర్ రాజేందర్‌కుమార్ యాదవ్‌లతో కలిసి మాట్లాడారు. వైద్యం వికటించి రోగి మరణిస్తే అది వైద్యుడు చేసిన హత్యానేరంగా పరిగణించి వైద్యుడిపై ఐపీసీ 304 సెక్షన్ కింద కేసు నమోదు చేసి శిక్షించేవారని, నూతనంగా ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహితలో ఈ నిబంధనను తొలగించడం అభినందనీయమని అన్నారు. ఇకపై వైద్యం వికటిస్తే వైద్యుడి మీద సేవా లోపం కింద మాత్రమే శిక్షార్హులవుతారని తెలిపారు..

## సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. 113వ వ్యవస్థాపక దినోత్సవం



జూబ్లీహిల్స్, డిసెంబర్ 22 : సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 113వ వ్యవస్థాపక దినోత్సవం దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ముంబైలోని కేంద్ర కార్యాలయంలో బ్యాంక్ వ్యవస్థాపకుడు సర్ సొరాబ్జీ పోచ్‌ఖానావాలా చిత్రపటానికి బ్యాంక్ ఎండీ, సీఈఓ ఎంవీ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు వివేక్ వాహి, ఎంవీ.మురళీకృష్ణ, మహేంద్ర దొహారేలతో పాటు ఇతర ఎగ్జిక్యూటివ్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2028 నాటికి నికర సున్నాకు కట్టుబడి ఉన్నామని తీర్మానిస్తూ ఈఎస్‌జీ విజన్ పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఎండీ, సీఈఓ ఎంవీ రావు, బ్యాంక్ వ్యవస్థాపకుడు సొరాబ్జీ మనవరాలు పిలూ హకీమ్ మాట్లాడుతూ కస్టమర్ సెంట్రిక్ ఉత్పత్తులకు ప్రాధాన్యతనివ్వడంతో పాటు సిబ్బంది ప్రయోజనాలకు అనేక పథకాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈఎస్‌జీ విజన్ అమలులో దీపక్ బత్రా, మిస్టర్ అతుల్ గుప్తా ప్రయత్నాలకు అభినందనలు తెలిపారు. ఐఐఎం ముంబైతో ఎంఓయూ సంతకాలు చేసిన సందర్భంగా డైరెక్టర్, ప్రొఫెసర్ మనోజ్ కుమార్ తివారీ, డీన్ అండ్ ప్రొపెసర్ శిరీష్సాగిల్‌లను సన్మానించారు.

## దుర్గం చెరువు పరిరక్షణకు కమిటీ

**ఆరు వారాల్లో నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు**

జూబ్లీహిల్స్, డిసెంబర్ 22 : దుర్గం చెరువుకు కాలుష్యం, ఆక్రమణల నుంచి విముక్తి కల్పించే దిశగా హైకోర్టు చర్యలు చేపట్టింది. దుర్గం చెరువు పరిరక్షణకు కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు ఆరు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 6కు వాయిదా వేస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ అనిల్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దుర్గంచెరువు వద్ద విద్యుత్ కాంతుల నడుమ అక్కడ జరిగిన ఆక్రమణలు, దుర్గంధం, కాలుష్యం కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయని ఇటీవల ఓ పత్రికలో వచ్చిన వార్తా కథనాన్ని హైకోర్టు సుమోటాగా స్వీకరించింది. ప్రజాహిత వాజ్యంగా స్వీకరించిన ఈ కేసులో విచారణను ప్రారంభించిన హైకోర్టు దుర్గం చెరువు పరిరక్షణ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులే ఉంటూ అంతా బేషుగ్గా ఉన్నదనే నివేదికలు ఇస్తారని గత విచారణ సమయంలో వ్యాఖ్యానించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నివేదికపై ఆధారపడబోమని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో నిబద్ధతతో వ్యవహరించే వారితో ప్రత్యేక కమిటీని ప్రతిపాదించాల్సిందిగా కోర్టు అమికస్‌క్యూరీ, సీనియర్ న్యాయవాది వేదుల శ్రీనివాస్‌ను ఆదేశించింది. ఆయన సూచించిన వారితో హై కోర్టు కమిటీని నూతన ఏర్పాటు చేసింది. ఇందులో నాగపూర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ సెంటర్ నుంచి అతుల్, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శాంతి వర్ధన్‌లతో కమిటీని ఏర్పాటుచేసింది. ఈ మేరకు దుర్గం చెరువు అంశంపై ఆరు వారాల్లో నివేదిక సమర్పించాలని సదరు కమిటీని ఆదేశించింది. చెరువులోకి రసాయన పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు, ప్లాస్టిక్, మురుగు వంటివి చేరడంతో నీటి కాలుష్యం తీవ్రంగా ఉన్నదని.. చేపలు చనిపోతున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

## ఎమ్మెల్యే అభ్యర్థులు.. ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించాలి

సిటీబ్యూరో/ మేడ్చల్ డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ ) : అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్న వివిధ పార్టీల ప్రతినిధులు ఎన్నికల్లో ఖర్చు చేసిన వివరాలను ఆయా నియోజకవర్గాల్లోని అకౌంటింగ్ టీమ్, ఏఈఓలకు అందజేయాలని హైదరాబాద్ జిల్లా అడిషనల్ కమిషనర్ (ఎన్నికల విభాగం) శంకరయ్య, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో అభ్యర్థుల ఖర్చుల వివరాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అభ్యర్థులు ఈ నెల 29 నాటిని తమ ఖర్చుల వివరాలను పూర్తి స్థాయిలో అందించినచో వాటిని వెబ్‌సైట్‌లో ఉంచడం జరుగుతుందని తెలిపారు. డీఈఓ, ఎన్నికల వ్యయ పరిశీలకులు, సహాయ వ్యయ పరిశీలకుల సమక్షంలో అకౌంటింగ్ రీ కన్సిలేషన్ సమావేశం నిర్వహించబడుతుందని అకౌంట్ నోడల్ ఆఫీసర్ శరత్‌చంద్ర తెలిపారు. ఆ లోపు అభ్యర్థులు తమ ఖర్చుల వివరాలను పొందుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల వ్యయ నియంత్రణ జిల్లా నోడల్ అధికారి శ్రీనివాసమూర్తి, నియోజకవర్గాల సహాయ వ్యయపరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

## పేయిన్ కిల్లర్స్‌తో కిడ్నీ సమస్యలు

**ఉత్తమ నెఫ్రాలజిస్ట్ అవార్డు గ్రహీత డాక్టర్ అరుణ్ కుమార్**



అవార్డుతో డాక్టర్ అరుణ్ కుమార్, చిత్రంలో సినీ నటుడు విరాజ్

ఖైరతాబాద్, డిసెంబర్ 22 : మూత్ర పిండాలు పదిలంగా ఉండాలంటే ముందుగా ఆ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని ఉత్తమ నెఫ్రాలజిస్ట్ అవార్డు గ్రహీత డాక్టర్ అరుణ్ కుమార్ అన్నారు. ఈ నెల 12న ఢిల్లీలోని హోటల్ శాంగ్రిల్లాలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఎస్పీ సింగ్ బాగెల్ చేతుల మీదుగా నెఫ్రాలజి విభాగంలో బెస్ట్ నెఫ్రాలజిస్ట్ ఆఫ్ ది ఇయర్, వరల్డ్ వైడ్ హెల్త్‌కేర్ అచీవర్స్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ అరుణ్ కుమార్‌ను ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటుడు విరాజ్ అశ్విన్ (బేబీ ఫేం), నెఫ్రోప్లస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రోహిత్ సింగ్‌తో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి ఐదు స్టేజీలు ఉంటాయని, 4, 5 స్టేజీల్లో మాత్రమే డయాలసిస్ స్థితికి వస్తారన్నారు. అయితే డయాలసిస్ చేసుకుంటే మరణిస్తారన్న అపోహ తగదని, వైద్యులు సూచించిన సమయంలో చేయించుకోకుండా నిర్లక్ష్యం చేసే వారికే ప్రాణాలమీదుకు వస్తుందన్నారు. నేడు గ్రామీణ ప్రాంతాలకు సైతం డయాలసిస్ వైద్యం విస్తరించాలన్నారు. మధుమేహం, రక్తపోటు, పేయిన్ కిల్లర్స్ వాడడంతో కిడ్నీ సమస్యలు వస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అవయవమార్పిడికి కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థలను అభినందించారు. ఈ అవార్డు తనకు బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరింత ఎక్కువ స్థాయిలో ప్రజా సేవకు కృషి చేస్తానని తెలిపారు.

# మస్తు..మస్తు.. క్రిస్మస్..!

**కెవ్వు కేకులు.. సాంటక్లాజ్‌లు**

**గ్రేటర్‌లో జోరందుకున్న సెమీ క్రిస్మస్ వేడుకలు**



సిటీబ్యూరో, డిసెంబర్ 22(నమస్తే తెలంగాణ) : డిసెంబర్ అంటే మిణుకుమిణుకు తారలు.. శాంతా క్లాజ్ సందళ్లు.. క్రిస్మస్ వంటకాల ఘుమఘుమలు.. మొత్తంగా క్రిస్మస్ పండుగ అంటే మరువలేని ఓ తియ్యని అనుభూతిని పంచే వేడుక. ప్రపంచ వ్యాప్తంగా ఈ వేడుకను క్రైస్తవులు అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. ఈ సారి సంప్రదాయ, ఆధునిక వంటకాల కలబోతతో పండుగ చేసుకుని హ్యాపీ హ్యాపీ క్రిస్మస్.. మెర్రీమెర్రీ క్రిస్మస్ అంటూ ఆత్మీయంగా పలుకరించుకునేందుకు నగరవాసులు సిద్ధమయ్యారు. ఈ అపూర్వమైన యేసు పుట్టినరోజు వేడుకను ఈనెల 25న ఘనంగా జరుపుకునేల గ్రేటర్ ముస్తాబైంది.



### నోరూరిస్తున్న కేకులు

క్రిస్మస్ అంటేనే కేకులు అనేంతలా సందడి ఉంటుంది. కేకు కటింగ్ లేకుండా క్రిస్మస్ వేడుకలు ముగియవు. అందుకే ప్లమ్ కేకు, ఫ్రూట్ కేకు, లో కొలెస్ట్రాల్ కేకు తదితరవన్నీ కేకులు విభిన్న రకాలుగా ముస్తాబయ్యాయి. నగరంలోని క్రిస్మస్ దుఖాణాలు.. పూర్తి సామగ్రితో కస్టమర్లను ఆకట్టుకుంటున్నాయి. సికింద్రాబాద్, కోఠి, దిల్‌షుక్‌నగర్ తదితర ప్రాంతాల్లో షాపులన్నీ క్రిస్మస్ సామగ్రితో కళకళలాడుతున్నాయి. స్కూల్స్‌లో చిన్నారులతో సాంటక్లాజ్ లాంటి గెటప్‌లతో పండుగలు జరుపుకుంటున్నారు.